కథ

దగ్గర దగ్గర యాభై ఏళ్ల తర్వాత పుట్టిన వూరైన విశాఖపట్నం వచ్చాను ప్రొఫెషనల్ పనులు చూసుకోడానికీ, మళ్లీ స్థిరపడాలనీ.

కొత్త రోడ్డు జంక్షన్‌లో మా పెద్ద ఇల్లు ఇప్పుడు లేదు. అమ్మేశాం. మొన్న అలా ఆ రోడ్డమ్మటి వస్తుంటే జ్ఞాపకాలు ఒక్కసారిగా పైకి చిమ్మాయి సముద్రపు కెరటపు జల్లులా. ఆ జల్లులో లీలగా ఒక నల్లని ఆకృతి కవిపించింది.

# పడిలేచే కడలి తరంగం

సుగుణ

వెంటనే డ్రైవరుతో కారు టౌనుహాలు బీచ్‌వేపు మళ్లించమన్నాను. ''అక్కడేం లేదు మేడం'' అన్నాడు వాడు. అంటే అక్కడ కూర్చోడానికి ఇసకా అదీ వుండ దని వాడర్థం.

''నాకు తెలుసోయ్, పోనీ'' అన్నాను విసుగుతో. ఆ ప్రదేశానికి వెళ్తే ఏదో కేప్చర్ చేయగలననే భావన నన్నో ఊపు ఊపింది.

గోడలు ఎత్తుగా కట్టేశారు, సముద్రం కనపడ కుండా. ఫిషింగ్ ట్రాలర్స్ పెట్టే ప్రదేశమైపోయింది ఆ జాగా అంతా. దారి పొడుగునా చేపల వాసన. కలక త్తాలో వుండి వుండి, నా ముక్కు ఆ సువాసనకి అల వాటు పడిపోయింది. అక్కడున్న ఒకటీ అరా గుడి సెల్లో ఆ నల్లని ఆకృతి కానీ కనపడుతుందేమోనని నా కళ్లు వెతుకుతున్నాయి- భూమికి మూడడుగుల ఎత్తులో! కార్లోంచి దిగి నిలడ్డాను, గుడిసెల్లోకి చూస్తూ.

''అమ్మగారేటి కావాలండి?'' అందో మగ గొంతు. నల్లగా వున్నాడు గోచీ పెట్టుకుని. చుట్ట వాసనా, చేపలదీ కలిసి అదోరకం గాలి నా చుట్టూ.

''తాతయ్య వున్నాడా?'' అన్నాను అప్రయ త్నంగా.

''నాకు తాతేటండీ?'' అన్నాడు భళ్లున నవ్వి.

వాడికే అరవై దాటుంటాయి. డ్రైవరుకి కాస్త విసు గేసినట్లుంది, ''వెల్డామ్ మేడమ్!'' అన్నాడు, పిచ్చాసు పత్రికి అన్న మాట బలవంతాన దిగమింగినట్లు.

అప్పుడు బ్రేక్ అయింది నా ఆలోచనా కెరటం. అదే సమయంలో నాకూ ఏభై దాటాయని కూడా గుర్తొచ్చింది.


''పద'' అన్నాను రియాలిటీలోకి వచ్చి.

నాకు ఆరేడేళ్లుండగా, రోజా టౌన్‌హాలు బీచికి పనిపిల్లనీ, ఒక డాల్‌నీ తీసుకుని, ఆడుకోడానికి వెళ్లే దాన్ని. బీచికిలా చేరుతూనే డాల్‌ని పని పిల్లకిచ్చేసి (ఆ డాల్ ఎప్పుడు దాని చేతిలో పడుతుందా అని అది రోజూ ఆత్రుతగా ఎదురుచూసేది) నేను ఇసకలో వున్న రాళ్ల గుట్టల వేపు పరిగెట్టేదాన్ని. అక్కడే ప్రతి సాయంత్రం నా అసలు నేస్తం ఒకడు వెయిట్ చేస్తూండే వాడు. వాడే 'తాతయ్య'.

నన్ను చూడగానే వాడి కళ్లు ఒక వింత మెరుపు మెరిసేవి. గోచీ ఒకటే వాడి ఆచ్ఛాదన. వాడి కళ్లలాగే ఒళ్లు కూడా మెరుస్తూండేది చేపల మీదున్న పొలుసులా. ఏవో ఆటలాడే వాళ్లం. కెరటం వచ్చినపుడు నేను భయపడి వెనక్కి గెంతితే విరగబడి నవ్వేవాడు. నా చేయి గట్టిగా పట్టుకుని కొంచెం ముందుకి తీసుకెళ్లే వాడు. నన్నలా తీసికెళ్తూంటే వాడి ముఖంలో ప్రపంచాన్నే జయించినంత ఆనందం కనిపించేది. ఆ క్షణాన నాకు భయం పోయి తొడల దాకా నీళ్లలోకి వెళ్లిపోయి, గౌనూ అదీ సుబ్బరంగా తడిపేసుకునే దాన్ని. ఇంటికి వెళ్లగానే, అవన్నీ ఊడబీకి ఒక మైసూర్ శాండల్ సబ్బంతా అరగదీసి మా అమ్మ సాన్నం చేయించేది ''ఈ చేపల కంపే విటే బాబూ'' అంటూ.

ప్రతి ఏడూ నా పుట్టినరోజు చాలా ఘనంగా జరుపుకునేదాన్ని. ఏడో పుట్టిన రోజుకి ఆటలమ్మ పోసి మొహం నిండా మచ్చలేర్పడ్డాయి. నా అందానికి పెద్ద లోటొచ్చిందని, ఆ ఏడాది గ్రాండ్ పార్టీ వద్దన్నాను. పుట్టినరోజు జరుపుకోవడం ఆనవాయితీ కాబట్టి, ఇంట్లో పిండి వంటలూ అవీ మామూలుగా చేసారు.

అమ్మనడిగితే ఎలాగూ 'నో' అంటుందని, మా



నాన్న దగ్గరకి చేరి మెల్లిగా అడిగాను ''నాన్నా, తాతయ్యని భోజనానికి పిలవనా?'' అని.

''ఎవడే ఆ ఓటు వెయ్యని 'ఓటరు'గాడా? సరే అమ్మకి చెప్పు'' అన్నారు.

'అమ్మనడుగు' అని జవాబు రానందుకు ఎగిరి గంతేసి అమ్మ దగ్గరకి పరిగెట్టాను.

ప్రతిరోజూ ఆటలయ్యాక దాహం వేసి టౌన్ హాల్లో బిలియర్డ్స్ ఆడే నాన్న దగ్గరకి మంచినీళ్లకోసం ఈసారి నేను తాతయ్య చేయిపట్టుకుని వెళ్లేదాన్ని. వాడికి నా కాన్వెంట్ ఇంగ్లీష్ అంతా నేర్పే తాపత్రయంతో సముద్రం గురించి, 'వాటర్, వాటర్ ఎవ్రీవేర్, నా టె డ్రాప్ టు డ్రింక్' అని అనమనేదాన్ని. వాడికి అంత వాక్యం పలికేది కాదు. ఎలాగో లాగ కష్టపడి మొదటి రెండు ముక్కలూ మాస్టర్ చేసి, టౌన్ హాల్లోకి వెళ్లగానే, 'వోటర్ వోటర్' అనేవాడు. మున్సిపల్ ఛైర్మన్ ఎలక్షన్‌కి నిలబడ్డ మా నాన్న చాలా రోజుల వరకూ, వాడో ఓటు వెయ్యనందుకే తను ఓడిపోయాననేవాడు.

భోజనం విషయం పక్కనే వుండి వింటున్న అమ్మ 'ఆ జాలారి గాడెందుకే' అని ఫార్మాలిటీకి అబ్జెక్టు చేసినా, అందులో 'వెయిట్' ధ్వనించక పోవడంతో నేను మరుక్షణాన పనిపిల్లని తీసుకుని మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటల వేళ బీచికి ఒకటే దౌడు తీశాను- ఇంకా అక్కడుంటే అమ్మ మనసు మార్చేసుకుంటుందనే భయంతో. ఆ జాలారి గాడిని మించిన స్నేహితుడు నాకప్పట్లో లేడు. ఇప్పుడూ లేడు.

వాడి నాన్నదొక పొడుగు చేతుల చొక్కా వేసుకుని, అది కాళ్లకడ్డం పడుతుంటే చేతులతో ఉమ్మ చుట్టేసి, తాతయ్య రాయల్‌గా మా ఇంట్లో విందు భోజనం చేయడానికి విచ్చేశాడు.

మరీ గేదెల పాకలో కూర్చోపెట్టలేదుకానీ, వంటింటి వసారాలో విస్తరేసి వాడికి వడ్డించిందమ్మ. కొంచెం అవతలగా నేనూ కూర్చున్నాను మరో ఆకేసుకుని నా సోమవారం అరిటాకు షేపు వెండికంచంతోసేసి. నాకు రోజుకొకటి చొప్పున వేరే వేరే షేపులూ, నగిషీలతో ఏడు వెండి కంచాలుండేవి వారానికి సరిపడా.

అమ్మని చూసి మొదట కొంచెం సిగ్గుపడ్డా, నా ఎంకరేజ్‌మెంటుతో తాతయ్య ఉత్సాహంగా తినడం మొదలెట్టాడు. ఆఖర్ని పాయసం వడ్డించిందమ్మ. కొంచెం నాకి, మొహం చిట్లించాడు వాడు.

అప్పటికే ధైర్యం వచ్చేసిందేమో, అమ్మని డైరెక్టుగా ''మీ ఇంట్లో తొక్కుంటదా?'' అని అడిగేసాడు.

అమ్మ నవ్వి, వాడి విస్తట్లో కాస్త ఆవకాయ పట్టుకొచ్చి వేసింది. నేనెలాగూ కారం తినలేను గనక నేనడగలేదు, అమ్మ వెయ్యనూ లేదు. తాతయ్య వెంటనే పాయసంలో మొత్తం ఆవకాయ కలిపేసుకుని తినేయడం మొదలెట్టాడు.

''ఓరి వెధవా! అదేంటి?'' అని నేను పెద్ద నవ్వు నవ్వాను.

అప్పుడే అక్కడికి వచ్చి ఈ తతంగమంతా చూస్తున్న నాన్న ''నోర్ముయ్!'' అని ఒక్క కేకేశారు. నేను బిక్కచచ్చిపోయి, బుర్ర దించేసుకుని ఆకులో మిగిలినవి కెలుకుతూ కూర్చున్నాను.

అంతవరకూ ఎప్పుడూ నాన్న నన్ను అలా కసరలేదు. నేను కూడా ఎవరినీ అంతవరకూ 'వెధవా' అని అనలేదు మరి.

అలాంటి పదప్రయోగాలకి మా అమ్మా నాన్న నా పెంపకంలో ఎప్పుడూ తావివ్వలేదు. సమ్మర్ హాలిడేస్‌కి గుంటూరు నుంచి వచ్చే నా కజిన్స్ (నాకన్నా కొంచెం పెద్దా, నాకు రోల్ మాడల్సూనూ) ఇలాటి పదాలు ఎడాపెడా వాడేస్తూ వుండేవారు. నాకూ వాళ్లలా మాట్లాడాలని సరదాగా వుండేది.

ఇన్నాళ్లకొచ్చిన అవకాశం జారవిడుచుకోలేక ఆ ఊపులో తాతయ్యగాడిని అలా అనేశాను.

ఇంటికి దిగబెట్టేటప్పుడు నాకన్నా తాతయ్యగాడెక్కువ బాధపడ్డాడారోజు. ''సప్పగుంది అమ్మలూ, అందుకని తొక్కడిగా'' అని సంజాయిషీ చెప్పుకున్నాడు.

వాడిదే తప్పన్నట్లు, వాడు నా ఆతిధ్యం స్వీకరించాడన్న సంతోషంలో నేను నాన్న కోప్పడిన విషయం వెంటనే మర్చిపోయాను.

''ఏవే, వాడ్నింటికి సవ్యంగా చేర్చావా, ఇంకా ఏవైనా వ్యాఖ్యానాలు ఉండిపోయాయా దారిలో?'' అని అమ్మ నిలదీసింది నన్ను ఇల్లు చేరగానే.

ఎవరినైనా అనవసరంగా విమర్శ చేసినపుడు మా అమ్మ వాడే ఫేవరిట్ తిట్టు 'వ్యాఖ్యానం'.

''నేనేవన్లే'' అని తలెగరేసి నేను వెళ్లిపోబోతూంటే, అమ్మ నన్నాపి, కూర్చోబెట్టి చెప్పిన బుద్ధులివీ...

''చూడమ్మా, వాడు బొత్తిగా లేనివాడు, వాళ్లిళ్లల్లో గంజీ, ఆవకాయ డొక్కూ తప్ప ఏం వుండవు తినడానికి. వాడింతవరకూ పాయసమే తినుండకపోవచ్చు. అదలాగ వుండగా, మనింటికి ఎవర్నైనా భోజనానికి పిలిస్తే, వాళ్లెలా కలుపుకుని తిన్నా మనం వ్యాఖ్యానం చేయకూడదు. వాళ్ల లేమిని అసలే ఎత్తి చూపకూడదు. వాడు చూడు, నీకోసం సముద్రంలో ఎంత లోతుకెళ్లి ఈ ప్రెజెంటు తీసుకొచ్చాడో! వాడ్ని అలా వెక్కిరించొచ్చా?'' అంటూ అమ్మ, వాడు నాకోసం తెచ్చి, హడావిడిలో నాకివ్వడం మర్చిపోయిన అరచేతి వెడల్పు గవ్వొకటి నా చేతిలో పెట్టింది.

ఆ తర్వాత తాతయ్యతో నేను చాలాసార్లే బీచిలో ఆడుకున్నాను. బోలెడు గవ్వలు కూడబెట్టి నాకిచ్చేవాడు. బొమ్మల కొలువులో వాడిచ్చిన పెద్ద గవ్వకి ఎప్పుడూ ప్రామినెంట్ ప్లేసుండేది. బీచి నుండి వచ్చినప్పుడల్లా అమ్మ సబ్బులరగదీస్తూనే వుండేది నా ఒంటిమీద. మురికిపోయేదేమోకానీ, నా మనసుకంటుకున్న 'స్నేహం' మాత్రం నన్నొదిలేది కాదు. దాన్నెవరూ కడగలేకపోయారు.

అమ్మా, నాన్నా పైలోకాలకు వెళ్లిపోయినా వాళ్లు నాకు నేర్పిన, నాలో నింపిన ప్రేమభావం నన్నంటిపెట్టుకుని, అన్ని రకాల ఒడిదుడుకుల్లోంచీ పైకి లాగుతూనే వుంది.

'స్నేహం' అనండి, 'ప్రేమ' అనండి దాన్ని కౌన్సిలింగ్ వృత్తిలో వున్న నేను నా చుట్టూ వున్న మనుషులకి, నా వారూ, పైవారూ అనే భేదం లేకుండా పంచుతూనే వున్నాను. దాని తాలూకు పరిణామం నా కొడుకుల్లో చూసినప్పుడు, నేనూ మా అమ్మా, నాన్నల్లాగే వేల్యూస్‌తో పెంచుతున్నాన్లే వీళ్లని అని తృప్తి చెందుతూ వుంటాను. అందుకనే నా చిన్నకొడుకు ఆఫీసుకోసం తెచ్చిన మూడు డజన్ల పెన్సిళ్లూ తీసుకుపోయి, వాడి క్లాస్‌లో వున్న అనాధ పిల్లాడికిచ్చేసి, 'అన్నెందుకురా వాడొక్కడికి' అని నేను ప్రశ్నిస్తే, 'నువ్వూ ఒక్కదానివే కదా, నీకు మటుకెందుకన్ని?' అని తిరిగి ప్రశ్నించినపుడు, మారు మాట్లాడక అన్ని డజన్లూ రీప్లేస్ చేసాను.

సముద్రపు కెరటంలా ఈ 'స్నేహశీలత' ప్రతి రిలేషన్‌షిప్‌లోనూ ఉప్పొంగి, మనసుని ప్రక్షాళన చేస్తూనే వుంది.

అన్ని రకాల సమస్యలకీ పరిష్కారం చూపిస్తూనే వుంది. ఆ 'ఫ్లో'కి నేనెప్పుడైనా ఆనకట్ట వేయగలనా అని అనుకుంటూ వుంటాను తరచూ.

మొన్నీమధ్య నా ఐదేళ్ల మనవరాలు, నా చేయి పట్టుకుని, నీట్లోకి లాగుతూ 'వేవ్స్ లవ్ యూ గ్రాండ్‌మా, దే ఆర్ కిస్సింగ్ యువర్ ఫీట్' అంటూంటే, 'చీర తడిసిపోతుందే' అని వెనక్కి జరిగినప్పుడు తాతయ్య పక్కనే నిలబడి నవ్వినట్లనిపించింది.

☆

